# ఆ క్షణం

-ఎన్. శివనాగేశ్వరరావు

ఆ క్షణం...

ఆ రైతు తన పంట పొలం గురించి ఆలోచిస్తున్నాడు. ఎందరి దగ్గరో అప్పుచేసి పొలంమీద పెట్టాడు. ఈ సంవత్సరమైనా పంట సక్రమంగా చేతికందితే కష్టాలు తీరుతాయి. లేకపోతే తామంతా పురుగుమందు తాగి చావవలసిందే. అతను నిట్టూర్చాడు. కళ్లు మూసుకుని నిద్ర పోవడానికి ప్రయత్నించాడు. అయితే నిద్ర కరువైంది.

అదే క్షణం... ఆ అమ్మాయి తన కడుపులో పడిన బీజం గురించి ఆలోచిస్తున్నది. అతను తనను నమ్మించి మోసం చేసాడు. పెళ్లి చేసుకుంటానని తనను అనుభవించి ఇప్పుడు మొహం తప్పించాడు. తాను గర్భవతినని చెప్తే ఎందరితో తిరిగావు? అని నీచంగా మాట్లాడాడు. తనకడుపు సంగతి అమ్మానాన్నకు తెలిస్తే చంపేస్తారు. తనకు జన్మలో పెళ్లికాదు. రేపే అబార్షన్ చేయించుకోవాలని అనుకుందా అమ్మాయి.

ఆ నిముషమే... ఆ సైంటిస్ట్ మనసులో ఎంతో అంతర్మథనం చెందుతున్నాడు. ఇన్ని సంవత్సరాల తన కృషి ఫలించింది. తన ప్రయోగం సక్సెస్ అయింది. అప్పుడే ఈ విషయం పొరుగుదేశం వారికి తెలిసి పోయింది. తన ఫార్ములా అప్పగిస్తే కోట్ల రూపాయలు ముట్టచెబుతానని వర్తమానం పంపారు. అదే తన దేశానికి ఫార్ములా అప్పజెప్పడంవలన సన్మానం, అభినందన పత్రం మినహా మరేం దక్కదు. మాతృభక్తి అనే పదం డిక్షనరీలో బాగుంటుందిగానీ ప్రాక్టికల్‌గా బావుండదు. ఫార్ములా పొరుగుదేశం వారికి అందజేయడమే నయం అనుకున్నాడతను. ఆ ఆలోచన అతనికి నచ్చింది. హాయిగా నిద్ర పట్టేసింది.

అదే సమయానికి ఆ అబ్బాయి తన ఉద్యోగం గురించి ఆలోచిస్తున్నాడు. ఎంత ప్రయత్నించినా ఇంతకాలం ఉద్యోగం దొరకలేదు. ఏజ్ బార్ అవబోతున్నది. ఈరోజు ఓ ఇంటర్వ్యూకి వెళ్లాడు. అక్కడి అధికారి ఉద్యోగం తనకివ్వడానికి అందరిలా లంచం అడగలేదు. తన కూతుర్ని పెళ్లి చేసుకొమ్మని అడిగాడు. ఆ అబ్బాయికి ఆ ప్రపోజల్ నచ్చింది. అటు ఉద్యోగం, ఇటు పెళ్లి మరునాడే తన సమ్మతి తెలియబరచాలని నిశ్చయించుకున్నాడు. భవిష్యత్తు ఉజ్వలంగా కనిపించి ఆనందంతో తేలియాడాడు.

అదేవేళ ఆ అడవిలో ముఖ్యమంత్రిని హతం చేయడానికి ఆ నలుగురు వ్యక్తులు పథకం తయారు చేస్తున్నారు. తమకు అడుగడుగునా అవరోధాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రిని లేపేయడమే నయమని ఆ నలుగురు ఏకాభిప్రాయానికి వచ్చారు. మరునాడు సిఎం మీటింగ్ వుంది. బాంబ్ ఎక్కడ అరేంజ్ చేయాలో, రిమోట్ కంట్రోల్‌తో ఎప్పుడు బాంబ్ ఎక్స్‌ప్లోజ్ చేయాలన్నది నిర్ణయించారు. తరువాత నినాదాలు చేస్తూ విడిపోయారు.

అప్పుడే... ఒక ఎలుక పకోడీ వాసనకు ప్రలోభపడి బోనులో దూరింది. టప్న బోను మూతపడిపోయింది. ఎలుక ప్రమాదం తెలుసుకుంది. తప్పించుకోవడానికి ఆరాటపడసాగింది. దేనికోసం ఆ బోనులో దూరిందో ఆ పకోడీ మీద దానికిప్పుడు మనసులేదు. ఎలా బయటపడాలా అన్నదే ప్రధాన సమస్యగా గింజుకోసాగింది.

ఆ క్షణం... ఆ స్టూడియోలో ఒక బ్లూఫిల్మ్ చిత్రీకరణ జరుగుతోంది. అందమైన ఆ అమ్మాయికి తప్ప తాగించారు. మద్యం కైపులో ఆ అమ్మాయి ఎదురుగా వున్న యువకుడ్ని అల్లుకుపోయి తన లేలేత అందాలను పచ్చిగా కెమెరాకు చూపించసాగింది.

అదేక్షణం... ఉయ్యాలలోని పసిపిల్లవాడు ఏడుపు లంకించుకున్నాడు. పాలిచ్చి వాడి ఆకలి తీర్చడానికి ఆ ఇల్లాలు పైకి లేవబోయింది. అయితే ఆమె భర్త తన కౌగిలి మరింత బిగించి ఆమెను కదలవద్దని మారం చేసాడు. ఆమె భర్త బుగ్గలు ముద్దాడి అతని కౌగిలి నుంచి విడివడి ఉయ్యాలలోని బిడ్డకు కడుపునిండా పాలిచ్చి పడుకోబెట్టి మరలా భర్త కౌగిలి చేరింది.

ఆ నిముషమే ఆ యువకుడు రిక్షావాడితో మంతనాలు సాగిస్తున్నాడు. "గంటకు ఎంత తీసుకుంటుంది? పోలీసుల భయం లేదుకదా?" అని అడుగుతున్నాడు. రిక్షావాడు "గంటకు వంద తీసుకుంటుంది. ఫ్యామిలీ సరుకులెండి సార్. ఇక పోలీసుల మాట మరచిపొండి. రిక్షా ఎక్కితే క్షణంలో స్వర్గానికి చేరుస్తా" అన్నాడు. ఆ యువకుడు రిక్షా ఎక్కాడు.

అదే సమయానికి ఓ ప్రఖ్యాత సినీ తార తనను వుంచుకున్న మగాడితో గొడవ పడుతున్నది. "ఇప్పటికి నా సొమ్ము లక్షలు తిన్నావు. అయినా తృప్తిలేదా? నీ ఉంపుడుగత్తెనన్న చెడ్డ పేరుకాక ఈ ఖర్మేంటి? నీవల్ల నాకు సుఖంలేదు. మరిక నాకు నీ ముఖం చూపించకు" అని ఖరాఖండిగా చెప్పేసింది. అతగాడు ఆమెవంక క్రోధంగా చూసాడు. 'లాభంలేదు. దీనిచేత బాగా మందు తాగించి మేడమీద నుంచి తోసేసి ప్రమాదవశాత్తు చచ్చినట్లుగా సీన్ క్రియేట్ చేయాలి. పోలీసులు నా చేతిలోవాళ్లు. నన్నెవరూ ఏం చేయరు' అనుకున్నాడు.

అదే వేళ ఆ ఇల్లాలు సముద్రంమీద వేటాడ్డానికి వెళ్లిన మగాడు ఇంకా రాలేదని కళ్లు పత్తికాయల్లా చేసుకుని ఎదురు చూస్తున్నది. సముద్రం మంచి పోటుమీద వుంది. మామకేం ప్రమాదం జరగలేదుకదా అని అల్లాడిపోసాగింది. వాడికేదైనా అయితే తను కూడా సంద్రంలో కలసిపోవలసిందే అనుకుంది. దేవుడి పటానికి దండం పెట్టుకుంది.

అప్పుడే... ఆ అబ్బాయి మరునాటి పరీక్ష గురించి ఆలోచిస్తున్నాడు. సినిమాల పిచ్చిలోపడి ఇంతకాలం చదువు నిర్లక్ష్యం చేసాడు. ఈ రాత్రికి చదివి ఏం వ్రాయగలడు? పరీక్ష తప్పితే నాన్న చంపేస్తాడు. ఎలాగైనా పరీక్ష పాసవ్వాలి. ఆ అబ్బాయి పరీక్ష పాసవ్వడానికి కాపీలు తయారుచేసే పనిలో నిమగ్నుడయ్యాడు.

ఆ క్షణం... అతను చడీచప్పుడు కాకుండా మంచం మీద నుంచి లేచాడు. భార్య మంచి నిద్రలో వుంది. నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లి వంటగది చేరాడు. స్టీల్ డబ్బాలోని సున్నుండలు తీసాడు. అతను డయాబెటిక్ పేషెంట్ కావడంవల్ల అతని భార్య అతన్ని స్వీట్స్ తిననివ్వదు. జిహ్వ చంపుకోలేని అతడు గబగబా సున్నుండలు తినసాగాడు.

అదే క్షణం పోలీసులు ఆ లాడ్జింగ్‌మీద రైడింగ్ చేసారు. సెక్స్ బుక్స్ చదివి ఆ అనుభవం రుచి చూద్దామని అక్కడికొచ్చిన నూనూగుమీసాల అబ్బాయి పోలీసులకు దొరికిపోయాడు. పోలీస్ వాన్ ఎక్కుతుంటే చచ్చిపోవాలన్న కోరిక కలిగింది అతడికి.


ఆ నిముషమే ఆ లాయర్ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. "నీవు చేసింది నేరమే. అయినా భయపడకు. నేనున్నానుకదా. తిమ్మినిబమ్మిని చేసి నిన్ను కాపాడుతాను. మాలాంటివాళ్లం న్యాయశాస్త్రం చదివింది నీలాంటి వాళ్లను రక్షించడం కోసమే. నీవు నిశ్చింతగా వుండు. డబ్బు మాత్రం సిద్ధంగా వుంచు" అని ఫోన్ పెట్టేసాడు.

అదే సమయానికి దేశ సరిహద్దులో ఎముకలు కొరికే చలిలో ఆ సైనికులు అప్రమత్తులై శత్రువుల ఉనికిని గమనిస్తున్నారు. ఏమాత్రం ప్రమాద సంకేతం వచ్చినా తుపాకీగుళ్ల వర్షం కురిపించడానికి సంసిద్ధులై వున్నారు.

అదేవేళ భర్త చనిపోయి కోరికలు చావని ఆ స్త్రీ ప్రక్క పోర్షన్‌లో చేరిన బ్రహ్మచారి యువకుడ్ని తన గదికి రప్పించడానికి ఉపాయం ఆలోచిస్తున్నది.

అప్పుడే... బడ్జెట్‌ను జీతం డబ్బుతో సరిపెట్టడానికి ప్రయత్నిస్తున్న ఓ కొడుకు తల్లి దగ్గు విని 'అమ్మ చచ్చిపోతే రెండు మూడొందలు మిగులుతాయి' అనుకున్నాడు.

ఆ క్షణం నెలలు నిండిన ఓ స్త్రీమూర్తి తన కడుపు చూసుకుంటూ చేత్తో దాన్ని స్పృశిస్తూ 'త్వరగా




బయటకు రా తల్లీ! ఎప్పుడెప్పుడు నిన్ను చూద్దామా అని వుంది' అని తన ప్రేమను పంచడానికి ఆరాటపడింది.

ఆ క్షణమే రైల్వేస్టేషన్‌లో కునికిపాట్లు పడుతున్న పాసింజర్ తాలూకు బ్రీఫ్‌కేసు కొట్టేసిన ఆ జేబుదొంగ మెరుపువేగంతో మాయమయ్యాడు.

ఆ నిముషం చెట్టు క్రింద పడుకున్న గుడ్డి భిక్షగాడు చలికి వణుకుతూ 'చలి పెరిగింది. రేపు ఏ తల్లినైనా అడిగి చిరిగిన దుప్పటి ఒకటి సంపాదించాలి. లేకపోతే చలికి బిగుసుకు చావగలను' అనుకున్నాడు.

అదే సమయానికి ఓ క్లబ్‌లో క్యాబరే డాన్సర్ మంచి హుషారుగా డాన్స్ చేస్తున్నది. ప్రేక్షకులు పిచ్చెక్కిపోతు న్నారు. కరెన్సీ కాగితాలు ఆమెమీదకు విసురుతున్నారు. ఆమె నగ్నదేహాన్ని ఆబగా చూస్తున్నారు.

అదేవేళ హాస్పిటల్ బెడ్‌మీద పడి వున్న అతనికి స్పృహ వచ్చింది. అదిచూసి అతని వాళ్లు ఆత్రుతగా అతని ముఖంలోకి చూసారు. అతను కళ్లు తెరచి అందరివంకా చూసాడు. ఏదో చెప్పాలని ప్రయత్నించాడుగానీ మాట రాలేదు. అతని కొడుకు డాక్టర్ని పిలవడానికి వెళ్లాడు. అయితే డాక్టర్ వచ్చేలోపే అతను కన్నుమూసాడు. అక్కడ విషాదం చోటు చేసుకుంది.

అప్పుడే గుడిసెలోని ఆ అమ్మాయి పురుడు పోసుకుంది. మంత్రసాని గుడిసె తలుపుతీసి బయటవున్న మగాళ్లకు మగబిడ్డ అని చెప్పింది. అక్కడంతా ఆనందం వెల్లివిరిసింది.

సరిగ్గా అదే సమయానికి భగవంతుడు సమస్త చరాచర జగత్తును గురించి జీవరాసుల గురించి ఆలోచిస్తున్నాడు.

ఆ క్షణం కరిగిపోతూ కాలపురుషుడిలో కలసిపోతూ అంది ''మహా పురుషా! నా ఆయుర్దాయం క్షణం. అయినా ఎన్నెన్నో అనుభవాలు చవి చూసాను. ఈపాటి ఆయుర్దాయానికే అనుభవాల తాకిడికి సతమత మయ్యాను. మరి నీవు నావంటి క్షణాలను, యుగాలను నీలో దాచుకున్నావుకదా? మరి నీవా తాకిడికి ఎలా తట్టుకుంటున్నావు?'' అని అడిగింది.

కాలపురుషుడు నవ్వి ''నిరంతర ప్రవాహంలా సాగిపోయే నాకు ఆ మాత్రం ఆలోచించే వ్యవధి ఎక్కడుంది?'' అన్నాడు.

ఆ క్షణం కాలపురుషుడిలో కలసిపోయింది.

★